క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డ్వామా పీడీ



కలెక్టర్ రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(సెంట్రల్): డ్వామా పీడీగా నియమితులైన పి.వెంకటరమణయ్య గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఉపాధి పనుల కల్పనపై దృష్టి సారించాలని కలెక్టర్ పీడీకి సూచించినట్లు సమాచారం.

నేడు కులమతాలకు అతీతంగా వనభోజనాలు

కర్నూలు కల్చరల్: మానవత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కర్నూలు మండలం ఉలిందకొండ సమీపంలోని సాయి సన్నిధి రిసార్ట్‌లో వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కుల మతాలకు అతీతంగా మానవత ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

24న కమ్మ సంఘం వనభోజనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న కమ్మ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన స్థానిక ఆత్మకూరు రోడ్డులోని కాకతీయ నగర్ కమ్మ సంఘం ప్రాంగణంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కమ్మ కృష్ణమోహన్, కార్యదర్శి పెనికలపాటి రాజశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక మాంటిస్సోరి స్కూల్ ప్రాంగణంలో వనభోజన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. వనభోజన కార్యక్రమానికి జిల్లాలోని కమ్మ సామాజిక వర్గానికి చెందిన కుటుంబ సభ్యులందరు హాజరు కావాలని కోరారు.

కబ్జాలను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): నగర శివారులోని జొహరాపురంలో బీడీ కార్మికులకు ఇచ్చిన స్థలాలు కబ్జాకు గురికాకుండా చూడాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్‌ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం కాలనీలో ఆవాజ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇళ్ల స్థలాలు పొందిన వారి దగ్గర ఒరిజినల్ పట్టాలు లేవన్నారు. దీంతో ఎవరికీ వారు దొంగ పట్టాలు సృష్టించి తమదే అంటూ ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు ఒరిజినల్ పట్టాలు ఇస్తే అక్రమార్కులను గుర్తించేందుకు వీలు ఉంటుందన్నారు. మహ్మద్, ఎండీ ఫరూక్ అహ్మద్, హఫీజ్, సయిద్‌బాషా పాల్గొన్నారు.

నేడు ఆర్‌యూలో ఫ్రెషర్స్ డే

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వర్సిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు తెలిపారు. అన్ని డిపార్ట్‌మెంట్‌ల విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అందరూ వేడుకల్లో పాల్గొనాలని సూచించారు.

నేడు పత్తికొండకు జిల్లా కలెక్టర్

పత్తికొండ(తుగ్గలి): జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శుక్రవారం పత్తికొండలో పర్యటించనున్నారు. అక్కడి గోపాల్ ప్లాజాలో నిర్వహించే డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొంటారని పత్తికొండ ఆర్డీఓ ఎస్.భరత్‌నాయక్ గురువారం తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



ఎల్లార్తి షేక్షావలి దర్గాలో స్వామివారి సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకొని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో పూజలు చేపట్టారు. కొందరు భక్తులు రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించి మొక్కులు తీర్చుకున్నారు. సమాధులకు గలీఫాలను సమర్పించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డి సాయి బాబా ఆలయాలను దర్శించుకున్నారు.

కొలనులో దిగితే సొరచేపలే !

- ఎస్‌జీఎఫ్ స్విమ్మింగ్‌లో రాణిస్తున్న నగర క్రీడాకారులు
- జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పతకాల పంట
- 17 మంది స్విమ్మర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్‌పూల్‌లో ప్రాక్టీస్ చేస్తున్న స్విమ్మర్లు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరం క్రీడలకు కేంద్రంగా మారుతోంది. మెరుగైన సౌకర్యాలు ఉండటంతో తల్లిదండ్రులు, విద్యాలయాల్లో మార్పు కనిపిస్తుంది. కేవలం చదువులకే పరిమితం గాకుండా చిన్నారులను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పుడు స్కూల్ గేమ్స్ క్రీడల్లో ఇటు తల్లిదండ్రులు, పాఠశాలల యజమాన్యాల వైపు ప్రోత్సాహం ఉండేది కాదు. అయితే ప్రస్తుతం స్కూల్‌గేమ్స్ క్రీడల్లో విద్యార్థినీ, విద్యార్థులు పోటీ పడుతున్నారు. రెండు నెలలుగా కర్నూలు నగరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నారు. మంచి స్పందన వచ్చింది. కర్నూలు నగరానికి చెందిన బాలబాలికలు అన్ని క్రీడల్లోను ప్రతిభ చాటుతున్నారు. ప్రత్యేకించి స్విమ్మింగ్ క్రీడలో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం శుభపరిణామం.

మెరుగైన సౌకర్యాలు– రాణిస్తున్న స్విమ్మర్లు

నగరంలోని కొట్ల కిసాన్ ఘాట్ సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. కోచ్, సహాయ కోచ్‌లు ఉండటంతో ఔత్సాహిక క్రీడాకారుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇక్కడ శిక్షణ పొందిన బాలబాలికలు పదుల సంఖ్యలో పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో రాణించారు. జిల్లా కలెక్టర్‌చే ప్రశంసలు పొందారు. దాదాపు 45 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ స్విమ్మింగ్‌పూల్‌లో ఫ్రీస్టయిల్, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్‌స్ట్రోక్, బటర్ ఫ్లై వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తుండడంతో జిల్లా కేంద్రం నుంచి పదుల సంఖ్యలో క్రీడాకారులు పతకాలు సాధించి గుర్తింపు తెచ్చుకున్నారు.

రికార్డు స్థాయిలో పతకాల కైవసం

ఈ ఏడాది స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో కర్నూలు నగరం నుంచి రికార్డు స్థాయిలో బాలబాలికలు పతకాలు కైవసం చేసుకున్నారు. 2023–24 విద్యా సంవత్సరం కింద ఇటీవల నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలుకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో 7 బంగారు పతకాలు, 5 వెండి పతకాలు 5 కాంస్య పతకాలు సాధించారు. మొత్తంగా 17 మెడల్స్ సాధించడం విశేషం. పతకాలు సాధించిన స్విమ్మర్లు జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించారు.

సామియా టాంజీన్ బంగారం



స్థానిక వడ్డెగేరిలో నివసించే సామియా టాంజీన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. స్విమ్మింగ్‌లోనూ రాణిస్తోంది. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 50 మీటర్లు, 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ విభాగంలో బంగారు పతకాలు సాధించింది. 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలోను బంగారు పతకం సాధించింది. జాతీయ స్థాయిలోనూ మంచి ప్రతిభ చాటేందుకు నిరంతరం సాధన చేస్తోంది.

మోడ్రన్ పెంటాథ్లాన్‌లో బాలాజీ చిరు చరణ్‌తేజకు స్వర్ణం



నగరానికి చెందిన ఈ స్విమ్మర్ మోడ్రన్ పెంటాథ్లాన్ క్రీడాంశంలో రాణిస్తున్నాడు. స్థానికంగా నారాయణ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 200 మీటర్ల పోటీల్లో బంగారు పతకం సాధించి శభాష్ అనిపించుకున్నాడు.

జాతీయ పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యం



నేను స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో 7వ చదువుతున్నాను. స్విమ్మింగ్ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించా. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. జాతీయస్థాయిలో పతకం సాధించడమే లక్ష్యంగా స్కూల్ అనంతరం ప్రతిరోజూ ప్రాక్టీస్ చేస్తున్నా. ఇటీవల పల్నాడు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ –14 విభాగంలో పాల్గొన్నా. 200 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో వెండి పతకం సాధించా.

– కె.శృతి, స్విమ్మింగ్ క్రీడాకారిణి

ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించాలి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): చిన్నారుల్లో శారీరక లోపాలు, అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం అందించాలని డెమో శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో జరుగుతున్న నాలుగు రకాల వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 18 ఏళ్ల పిల్లల వరకు వైద్యపరీక్షలు నిర్వహించి వారిలో ఆరోగ్య సమస్యలను గుర్తించి ఉచిత వైద్యం అందించే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రహణమొర్రి, పెదవి చీలిక, వంకర పాదాలు, నడుము భాగం వృద్ధిలోపం, సంక్రమిక కంటి పొర, గుండెజబ్బులు, పుట్టుకతో వచ్చే చెవుడు, రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ, రక్తహీనత, విటమిన్ల లోపం, మేథో పరమైన అసమానత, వయసుకు అనుగుణంగా మాటలు రాకపోవడం, ఆటిజం, అభ్యసన సమస్యలు, తలసీమియా, డౌన్ సిండ్రోమ్, న్యూరల్ ట్యూబ్ లోపం సహా ఇతర 30 రకాల ఆరోగ్య సమస్యలు గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. స్క్రీనింగ్ పరీక్షలలో గుర్తించిన వ్యాధులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ నంబర్ 42లో ఉన్న జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో వైద్యనిపుణులచే చికిత్సలు అందిస్తారన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్యవిద్యా బోధకురాలు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

పాత పనివేళలను కొనసాగించాలి

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పాత పనివేళలను కొనసాగించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె క్రిష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల పనివేళలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచాలని తీసుకున్న నిర్ణయం సరైంది కాదని పేర్కొన్నారు. సమయాన్ని పెంచడంతో విద్యార్థులు ఇబ్బందులు పడతారని, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల ప్రయాణానికి అసౌకర్యంగా ఉంటుందని వివరించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న స్కూళ్ల వేళలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని, ఆయా రాష్ట్రాల్లో బడుల పనివేళలు 7 గంటలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన నెల్లూరు జిల్లాతో పాటు, అన్ని చోట్ల బడి వేళల పెంపును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

బీసీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు (అర్బన్): బీసీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక కృష్ణకాంత్ ప్లాజాలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అత్యధిక జనాభా ఉన్న బీసీలకు పాలక ప్రభుత్వాలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య పరంగా, రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల ఐక్యత కోసం ఈనెల 23న అన్ని బీసీ కులాలతో కలసి సామూహిక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీసీల కులగణనతో పాటు చట్ట సభల్లో బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.మద్దిలేటి మాట్లాడుతూ.. దేశంలో 50 శాతం బీసీల జనాభా ఉన్నా ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం దారుణమన్నారు. 23న ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం నుంచి అన్ని బీసీ కులాలు ర్యాలీగా బయలుదేరి నందికొట్కూరు రోడ్డులోని ఆదర్శ విద్యా మందిర్‌కు చేరుకోవాలన్నారు. అక్కడ వనభోజనంతో పాటు బీసీ శంఖారావం రాష్ట్ర మహాసభ జరుగుతుందని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నూకారమ్మ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సబిత, తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

బ్యాటరీల నిర్వహణపై శిక్షణ



మాట్లాడుతున్న కడప ఈడీ పైడి చంద్రశేఖర్

కర్నూలు సిటీ: ఆర్టీసీ శిక్షణ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన మెకానికల్ ఇన్‌చార్జ్‌లు, ఎలక్ట్రీషియన్‌లకు బ్యాటరీ నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి గురువారం ఏపీఎస్‌ఆర్టీసీ కడప ఈడీ పైడి చంద్రశేఖర్ హాజరై ప్రసంగించారు. మెకానికల్ ఇన్‌చార్జ్‌లు, ఎలక్ట్రీషియన్‌లు బ్యాటరీలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆర్టీసీలో ఇటీవల నూతన బస్సులు వచ్చాయని బ్యాటరీలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ తరువాత ఎక్సైడ్ సర్వీసు ఇంజినీర్లు, బ్యాటరీ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, కర్నూలు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ హరిబాబు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధారాణి, కర్నూలు–2 డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్, ప్రిన్సిపాల్ నజీర్ అహమ్మద్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మెకానికల్ ఇన్‌చార్జ్‌లు, ఎలక్ట్రీషియన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు బస్టాండు, ఆర్టీసీ హౌసింగ్‌లో పనిచేస్తున్న కార్మికులను, కోవిడ్ సమయంలో తొలగించిన స్వీపర్స్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ బస్టాండ్ కాంట్రాక్ట్ స్వీపర్స్ యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు గురువారం జిల్లాకు వచ్చిన ఆర్టీసీ కడప ఈడీ పైడి చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ యా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ.. కర్నూలు బస్టాండుతో పాటు, ఆర్టీసీ హౌసింగ్‌లో మొత్తం 43 మంది స్వీపర్స్‌గా పనిచేసే వారని, కోవిడ్ సమయంలో 24 మందిని తొలగించారన్నారు. తర్వాత 13 మందికి తిరిగి విధుల్లోకి తీసుకున్నారని, ఇంకా 11 మంది తీసుకోకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు, నగర ప్రధాన కార్యదర్శి సీ.హెచ్ సాయిబాబా, నగర కార్యదర్శి ఎస్.మహమ్మద్ రఫీ, కాంట్రాక్ట్ స్వీపర్స్ యూనియన్ నాయకులు పి.దేవరాజు, జి.నరసింహులు, మేరి బి.శాంతి, తదితరులు ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం ప్రదర్శిస్తున్న బాలవికాస్ విద్యార్థులు



పాల్గొన్న సాయి భక్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను పురస్కరించుకొని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నృత్యాలు అలరించాయి. బాలవికాస్ విద్యార్థుల ఆధ్యాత్మిక నృత్య రూపకాలు, సంగీత కార్యక్రమాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, మహిళా విభాగం అధ్యక్షులు సరోజ, సభ్యులు మాధురి, లటిశెట్టి జ్యోతి, విష్ణువర్ధన్, సంధ్య, సందీప్, సాయి భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి



సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: గ్రామ సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి తెలిపారు. గురువారం ఆయన కె.మార్కాపురం, బస్తిపాడు గ్రామ సచివాలయాలను ఈఓఆర్డీ నాగేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సచివాలయాల్లో హాజరు పట్టి, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్‌పీసీఐ మ్యాపింగ్, ఇంటింటి జియోట్యాగింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఎంపీడీఓ పరిశీలించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంజుల వాణి

కల్లూరు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) వినియోగంలోకి తేవాలని డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ మంజుల వాణి సూచించారు. మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామం చెత్త సంపద కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. తడి, పొడి చెత్త, గాజు సీసాలు వేరు వేరుగా సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామంలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ దగ్గర ఇన్‌లైన్ క్లోరినేషన్‌ను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రిజిస్టర్లను, రికార్డులను తనిఖీ చేశారు.

మాస్ కాపీయింగ్‌పై చర్యలేవీ ?




మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యపరీక్షల్లో జోరుగా చూచిరాతలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు విమర్శించారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో ఆ యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నిర్వాహకులకు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందని, విద్యార్థుల నుంచి వేలకు వేలు డబ్బులు తీసుకొని యథేచ్ఛగా కాపీయింగ్ చేస్తున్నారన్నారు. అధికారులు వారికి వత్తాసు పలకుతుండడంతో ఇష్టారాజ్యంగా మారిందని విమర్శించారు. నిబంధనల ప్రకారం పరీక్షలను పత్తికొండ వైష్ణవి డిగ్రీ కాలేజీ, డోన్ వైష్ణవి, గూడూరు ఎస్‌ఆర్ సెంటర్లలో నిర్వహించాల్సి ఉండగా కర్నూలు శివారులోని అబ్దుల్లా బీఈడీ కాలేజీ, ఎస్‌ఎల్వీ బీఈడీ కాలేజీ, బాల శివ డిగ్రీ కాలేజీల్లో జరుపుతున్నారని, అయినా యూనివర్సిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి చూచిరాత కోసం రూ.3 వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో బాబయ్య, బీసన్న, చంటి పాల్గొన్నారు.

వెల్దుర్తిలో చోరీ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని నాల్గవ వార్డులోని నివాసముంటున్న మిద్దె రామాంజనేయులు ఇంట్లో గురువారం సాయంత్రం చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. రామాంజనేయులు భార్య కళావతి సాయంత్రం ఇంటికి తాళం వేసి పిల్లలను తీసుకురావడానికి స్కూల్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాను పగలగొట్టి రూ.50 వేల నగదు, 25 తులాల వెండి ఆభరణాలను దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

24న బలిజ కార్తీక వనభోజనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న బలిజ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): నగర కాపు, తెలగ, బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న కార్తీక వనభోజన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, రవికుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఐదు రోడ్ల కూడలిలోని కార్యాలయంలో వనభోజన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞాన పీఠంలో వనభోజన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. నగరం చుట్టుపక్కల ప్రాంతాల వారు హాజరయ్యేందుకు వీలుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, జబర్దస్త్ టీం వారిచే హాస్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. సంఘం నాయకులు శైలేష్, వెంకటేశ్వర్లు, అనిమిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను ఖండిస్తూ నవంబర్ 26వ తేదీన చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల కడుపు కొడుతోందని విమర్శించారు. అన్నదాతకు మద్దత ధర లభించేలా చట్టం చేయాలని కోరితే తిరస్కరిస్తోందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తేవడంతో బానిసలుగా బతకాల్సి వస్తోందన్నారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాటాల్లో భాగంగా నవంబర్ 26వ తేదీన అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో మహా ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. సీపీఎం నాయకులు పి.నిర్మల, నరసింహులు, టి.రాముడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



ట్రాఫిక్ సమస్యపై చర్చిస్తున్న అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం రహదారుల భద్రత కమిటీ నిర్ణయాల అమలుకు సంబంధించి కమిషనర్ ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి నగరంలో పర్యటించారు. బిర్లా కాంపౌండ్, గాయత్రీ ఎస్టేట్, సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, వై.జంక్షన్, కొండారెడ్డి బురుజు ప్రాంతాల్లో అధికారులు పర్యటించి స్థానికంగా ట్రాఫిక్ ఇబ్బందులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వర రెడ్డి, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.